





నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

కర్నూలు నంద్యాల

బుధవారం | 19 నవంబరు 2025

పేజీలు 8


### వైభవంగా మహానందీశ్వరుడికి

# లక్ష బిల్వార్చన

● వేదమంత్రాలతో మహాన్యాస పూర్వక మహా రుద్రాభిషేకం

**మహానంది, మేజర్‌న్యూస్ :** మహానంది పుణ్య క్షేత్రంలో కార్తీక మాసం మాస శివరాత్రి రోజున లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మంగళ వారం వేదపండితులు బ్రహ్మశ్రీ రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, శాంతారాం భట్‌లతో పాటు ప్రత్యేక వేదపండితులు వేదమంత్రాలతో ఈవో శ్రీనివాసరెడ్డి నేటి ఉభయదాతలైన రామకృష్ణా విద్యాసంస్థల అధినేత డాక్టర్ జి రామకృష్ణారెడ్డి, విజయకుమారి దంపతులచే, గడ్డం హేమంత్‌రెడ్డి, ప్రగతి దంపతులను కంకణ ధారులను చేసినేటి పూజలు నిర్వహించారు. ముందుగా గోపూజలనుప్రారంభించి గర్భాలయం వద్ద గణపతి పూజ, పుణ్యాహవాచనం,

మిగతా 2లో



మహానంది క్షేత్రంలో గోపూజ నిర్వహిస్తున్న దృశ్యం



అన్న క్యాంటీన్‌లో ప్రజలకు వడ్డిస్తున్న జిల్లా కలెక్టర్

### వ్యాధులు నివారించేందుకు

# జాగ్రత్తలు తీసుకోవాలి

- రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలి
- పత్తి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి

**ఆదోనిరూరల్, మేజర్ న్యూస్ :** మిరప పంటకు, కాయ కుళ్లు, కాయ మచ్చ వంటి వ్యాధులు నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి రైతులకు సూచించారు. ఆదోని మండలం మదిరె గ్రామంలో మంగళ వారం

మిగతా 2లో



మిరప పంటను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# చంద్రబాబు నాయకత్వంలో విశాఖ సిఐఐ సదస్సు సూపర్ సక్సెస్

◆ రాష్ట్ర రోడ్లు,భవనాల శాఖ మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బిసి.జనార్ధన్‌రెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** రెండు రోజులపాటు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో జరిగిన సి.ఐ.ఐ సదస్సు సూపర్ సక్సెస్ అయ్యిందని దీని ద్వార పలు కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ఒప్పందాలను కుదుర్చుకున్నాయని దీని ద్వార ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. మంగళవారంనాడు మంత్రి బి.సి పాత్రికేయులతో మాట్లాడుతూ రెండురోజులపాటు విశాఖలో జరిగిన సిఐఐ సదస్సు రాష్ట్రంలో సువర్ణ అధ్యాయానికి తెర తీసిందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో 603 ఒప్పందాలతో 13.25లక్షల కోట్లు పెట్టుబడులు రావడం అంటే నిజంగా

మిగతా 2లో

### శ్రీశైలంలో బస్సులు లేక

# ప్రయాణికుల ఇబ్బందులు

2లో



బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

# ఉమ్మడి జిల్లాలో రోడ్డు ప్రమాదాలు

-నలుగురు మృతి..ఇద్దరి పరిస్థితి 2లో

**కర్నూలు క్రైం,శ్రీశైలం మేజర్‌న్యూస్ :** ఉమ్మడి కర్నూలు జిల్లా మంగళవారం జరిగిన ప్రమాదాలలో నలుగురు మృతి చెందగా,ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్న సంఘటనలు చోటు చేసుకున్నాయి. వివరాల్లోకి వెళ్లితే..నంద్యాల జిల్లాలోని శ్రీశైలం ఘాట్ రోడ్డులో మంగళవారం బస్సు బైకు ఢీకొన్న సంఘటనలో ఒక యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా ,మరో యువకుడి పరిస్థితి విషమంగా ఉంది.అలాగే కర్నూలు జిల్లాలోని కర్నూలు నగరంలోని ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా మరో వ్యక్తి ఆసుపత్రిలో మృతిచెందాడు, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది.

# గోనెగండ్ల మండలంలో పర్యటించిన కేంద్ర వ్యవసాయ శాఖ బృందం

2లో

# అర్హులందరికీ ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి

➲ శాశ్వాత కుల ధృవీకరణ పత్రాలు అందజేయాలి

➲ నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా

**నంద్యాల కల్చరల్, మేజర్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన హౌసింగ్ కొత్త స్కీం గురించి ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి అర్హులకు ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి తహశీల్దార్లకు సూచించారు. మంగళ వారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ రాజకుమారి తహశీల్దార్లతో పలు రెవెన్యూ అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి పేదవాడికి ఇళ్లు నిర్మించాలనే ఉద్దేశంతో ముందుకు వెళ్తుందని

మిగతా 2లో



తహశీల్దార్లతో రెవెన్యూ అంశాలపై సమీక్షిస్తున్న కలెక్టర్ రాజకుమారి

సూర్య www.suryaa.com



# వ్యాధులు నివారించేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

పొలం పిలుస్తుంది కార్యక్రమంలోభాగంగా, మిరప పంట సాగును, ఎన్టీబీఎల్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్, దాదాపీర్ మిల్ యూనిట్‌లలో పత్తి కొనుగోలు ప్రక్రియను, అన్న క్యాంటిన్లను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మిరప పొలాలను సందర్శించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు, పంట పరిస్థితులు గురించి అడిగి తెలుసుకున్నారు. మిరప పంట సాగుకు ఎకరాకు ఎంత పెట్టుబడి వస్తుంది... విత్తనాలు ఎక్కడ నుండి కొనుగోలు చేస్తున్నారనే విషయాలను జిల్లా కలెక్టర్ రైతులను అడిగి తెలుసుకున్నారు.

**పత్తిరైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం... జిల్లా కలెక్టర్ :** పత్తి రైతుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. పత్తికిమించి ధర వచ్చేందుకు వీలుగా రైతులు పత్తిని బాగా ఆరబెట్టుకొని తేమ శాతం లేకుండా తీసుకొచ్చే విధంగా చూసుకోవాలని కలెక్టర్ రైతులకు సూచించారు. రైతులు నష్టపోకుండా కనీస మద్దతు ధరతో కొనుగోలు చేయాలని కలెక్టర్ సిసిఐ అధికారులను కోరారు. పంట ఎక్కువగా ఉందని, మిల్లులు కొన్ని మాత్రమే ఓపెన్ అయ్యాయని, మిగిలిన మిల్లులను కూడ త్వరగా ఓపెన్ చేయించాలని, యాప్‌లో స్లాట్లు వెంటనే క్లోజ్ అవుతున్నాయని, సర్వర్ సమస్యలు ఉన్నట్లు సచివాలయ సిబ్బంది చెబుతున్నారని, పత్తిరైతులు వారి సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొని రాగా వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం అన్న క్యాంటిన్ ద్వారా రుచి, శుచితో ఉన్న భోజనాన్ని ప్రజలకు అందించాలని కలెక్టర్ అన్న క్యాంటిన్ సిబ్బందికి ఆదేశించారు. అక్కడే భోజనం చేస్తున్న యువకులు, మహిళలతో మాట్లాడుతూ, భోజనం రుచిగా ఉందా... సరిపోయేంత పెడుతున్నారా.. ప్రతి రోజుల ఇక్కడే భోజనం చేస్తున్నారా, భోజనపరంగా ఏమైనా సమస్యలు ఉన్నాయనే సమస్యలను జిల్లా కలెక్టర్ ఆరా తీశారు. అనంతరం అన్న క్యాంటిన్‌లో భోజనం చేస్తున్న ప్రజలకు కలెక్టర్ స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఇంచార్జీ సబ్ కలెక్టర్ తోట అజయ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మీ, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, తహాశీల్దార్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా మహానందీశ్వరుడికి లక్ష బిల్వార్చన

(మొదటి పేజీ తరువాయి)



కలశ పూజలు నిర్వహిస్తున్న దృశ్యం



బిల్వ పత్రాలను సేకరిస్తున్న దృశ్యం



నందీశ్వరుడి వద్ద బిల్వార్చన నిర్వహిస్తున్న దృశ్యం

మహా సంకల్పం, రుత్విక్వరణ, దీక్షాధారణ, అఖండ స్థాపన, కలశ స్థాపన పూజలను ఉదయం నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీ మహానందీశ్వర స్వామివారికి 121 రుద్రమంత్రాలతో మహాన్యాస పూర్వకంగా మహా రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. సాయంకాలం ప్రదోష కాలంలో నక్ష మండలం అష్టోత్తర శత శంఖ ఆవాహనాది ఉపచార పూజలు నిర్వహించి దక్షణావృత శంఖంతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం నల్లమల అడవి నుంచి సేకరించిన బిల్వ పత్రాలతో లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని స్వామివారికి నిర్వహించారు. ప్రత్యేక అలంకారంతో భక్తులకు దర్శనం కల్పించారు. నీరాజన మంత్ర పుష్పంలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

# చంద్రబాబు నాయకత్వంలో విశాఖ సిఐఐ సదస్సు సూపర్ సక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

ఇది గేమ్ ఛేంజింగ్ మూమెంట్ అని అన్నారు. నాడు లోకేష్ బాబు యువగళంతో 20లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని మాట ఇస్తే నేడు సిఐఐ సదస్సు ద్వారానే 16లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించడానికి అవకాశం ఉందన్నారు. విశాఖ సమ్మిట్ ప్రారంభం కాక ముందు 35 సంస్థలు 3.65లక్షల పెట్టుబడులు పెట్టేదుకు ఒప్పందాలు కుదుర్చుకోవడం సంతోషకరమని అన్నారు. ఈ సదస్సు ఇంత పెద్ద ఎత్తున విజయవంతం కావడం పక్క రాష్ట్రాలు అసూయపడేలా పెట్టుబడులు రావడం వెనుక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నారా లోకేష్ కృషి ఎంతో ఉందన్నారు. మెరుగైన మౌళిక సదుపాయల కల్పనతో నమ్మకమైన సంస్థలు పరిశ్రమలు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్టడం ద్వార ఉద్యోగ ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గత 5 సంవత్సరాలలో ప్రతిపక్షం విధ్వంసకర విధానాలతో రాష్ట్రం నుంచి వెళ్లిపోయినా నేడు కంపెనీలు స్పీడప్ డూయింగ్ బిజినెస్ పద్ధతులకు ఆకర్షితులై తిరిగి వెనక్కి రావడం శుభపరిణామమన్నారు. విశాఖ సిఐఐ సదస్సులో తన శాఖ పెట్టుబడులు మరియు మౌళిక సదుపాయాలకు మారిటైమ్ బోర్డు మరియు ఏపీఏడిసిఎల్‌తో దాదాపు 38 సంస్థలు 2.07లక్షల కోట్ల ఒప్పందాలు చేసుకోవడం ద్వార 3.06లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయని తెలిపారు. గత 17 నెలల కాలంలో గుడ్ గవర్నెన్స్ సుస్థిరమైన నాయకత్వం కొనసాగుతుందన్నారు. సి.ఐ.ఐ సదస్సు ఫలాలు రాష్ట్రంలో ప్రతి జిల్లాలో ప్రతిబింబిస్తాయన్నారు. రాష్ట్ర సుస్థిర అభివృద్ధి కోసం తపించే కూటమి ప్రభుత్వం దీర్ఘకాలంతోపాటు అధికారంలో ఉండటం ద్వారా ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి బలమైన ముద్ర పడుతుందని ప్రజలంతా విశ్వశిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా అభివృద్ధి దిశగా పనిచేస్తూ బలమైన నాయకత్వంతోనే ఉంటారని బీహార్ ఎన్నికలతో రుజువైందని తెలిపారు.

# జాతీయ రహదారి 44పై ఘోర రోడ్డు ప్రమాదం

**:-ముగ్గురు మృతి-ఒకరికి తీవ్ర గాయాలు**



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారిపై మంగళ వారం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసు కుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందగా మరో వ్యక్తి ఆసు పత్రిలో మృతిచెందాడు, మరొకరి పరిస్థితి విషమంగాఉంది. వివరాల మేరకు ఎన్‌హెచ్ 44పై కేశవ గ్రాండ్ హోటల్ ఎదురుగా ఏపి 21టిబి 2244అనే నెంబరు గల లారీ బ్రేక్ ఫెయిల్ కావడంతో రోడ్డు సైడుకు ఆపి లారీలోని నలుగురు వ్యక్తులు రామిరెడ్డి,



లక్ష్మీనారాయణ, గోకులపాడుకు చెందిన వడ్డే శ్రీనివాసులు, మెకానిక్ ఇంతియాజ్‌లు లారీ సామాను తెచ్చుకునేందుకు రోడ్డు దాటుతుండగా బళ్లారి చౌరస్తా ఫ్లైఓవర్‌పై నుండి అతివేగంగా వస్తున్న వెల్దుర్తికి చెందిన ఏపి 39యుపి 2277అను నెంబరు గల లారీ నలుగురిని ఢీకొనగా నగరంలోని రాజీవ్‌నగర్‌కు చెందిన రామిరెడ్డి, లక్ష్మీనారా యణలు అక్కడికక్కడే మృతిచెందగా, గోకులపాడుకు చెందిన వడ్డే శ్రీనివాసులు ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందాడు. ఇం తియాజ్ పరిస్థితి విషమంగా ఉందని వైద్యు లు తెలిపారు. డ్రైవర్ అతివేగంగా, అజాగ్ర త్తగా నడపడం తోనేఈ ప్రమా దం చోటు చేసు కుంది. అయితే లారీ డ్రైవర్ పక్కనే ఉన్న పెట్రోల్ బంకువద్ద లారీ ని ఆపి పరార య్యారు. ఘోరరోడ్డు ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌అంతరాయం ఏర్పడగాకర్నూలు డిఎస్పీబాబుప్రసాద్, ట్రాఫిక్‌సిఐ మన్సూరు ద్దీన్, త్రీ టౌన్ సిఐ శేషయ్య, 4వ పట్టణ సిఐ విక్రమసింహ, సిబ్బంది సంఘట న స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించ గా, గాయపడిన వ్యక్తికి చికిత్స అందిస్తున్నా రు. ఈ మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



# అర్హులందరికీ ఇంటి స్థలాల మంజూరుకు చర్యలు తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

హౌసింగ్ నూతన విధి విధానాల ద్వారా రూరల్ పరిధిలో ఉండే లబ్ధిదారులకు 3 సెంట్లు, అర్బన్ పరిధిలో ఉండే లబ్ధిదారులకు 2సెంట్లు చొప్పున ఇంటి స్థలం కేటాయించడం జరుగుతుందన్నారు. హౌసింగ్ కొత్త స్కీం గురించి ప్రజాప్రతినిధుల ద్వారా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయాల్లో ఇంటి స్థలాలకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొనే విధంగా వారికి తెలియజేయాలన్నారు. ప్రతి సోమవారం తహాశీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పిజిఆర్‌ఎస్ కార్యక్రమంలో ప్రజలు ఇచ్చే దరఖాస్తులను ఆన్‌లైన్ చేసి వారికి రశీదు ఇవ్వాలన్నారు. తహాశీల్దార్ కార్యాలయంలో ప్రజలు ఇచ్చే అర్జీని ఆన్‌లైన్ చేసి వారికి రశీదు ఇచ్చి నిర్దేశించిన గడువు లోపల వారి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పట్టా భూములకు 22ఏలో చేర్చడానికి వీలులేదని అలా ఎక్కడైనా జరిగినట్లయితే వెంటనే 22ఏ లో నుంచి పట్టా భూములను తొలగించాలన్నారు. ఈకార్యక్రమంలో జేసీ కార్తీక్, ఆర్డీవోలు, తహాశీల్దార్లు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో బస్సులు లేక ప్రయాణికుల ఇబ్బందులు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** కార్తీక మాసం చివరి సోమవారం కారణంగా శ్రీశైలానికి భక్తులు పోటెత్తారు.మల్లన్న దర్శనం అనంతరం తిరుగు ప్రయాణమయ్యే క్రమంలో బస్సులు సక్రమంగా లేక శ్రీశైలం,సున్నిపెంట బస్టాండ్ల వద్ద భక్తులు పడిగాపులు కాస్తున్నారు. ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఆటోలు, ప్రైవేట్ జీపుల వారు దోర్నాలకు అధిక ఛార్జీలు వసూలు చేస్తున్నట్లు పలువురు భక్తులు పేర్కొన్నారు.

# శ్రీశైలం ఘాట్లో బస్సు,బైకు ఢీ

**-ఒకరి మృతి..మరొకరి పరిస్థితి విషమం**



షేక్ .ఖాజావలి

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** శ్రీశైలం ఘాట్ రోడ్‌లో మంగళవారం సాయంత్రం బస్సు-బైక్ ఢీకొనిన ఘటనలో ఓ యువకుడు మృతి చెందగా మరొక యువకుడి పరిస్థితి విషమంగా ఉంది.ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన షేక్ ఖాజావలి,స్వామి అనే ఇరువురు బైక్ పై శ్రీశైలం వచ్చి తిరిగి వెళ్తుండగా శ్రీశైలం ఘాట్ రోడ్‌లోని అభయ ఆంజనేయ స్వామి దేవాల యం సమీపంలో వారు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న ఏపీఎస్ఆర్టీసీ మార్కాపు రం డిపోకు చెందిన పల్లె వెలుగు వాహనానికి ఢీకొనింది. ఈ ఘటనలో ఖాజావలి అక్కడికక్కడే మృతి చెందగా స్వామిని శ్రీశైలం ప్రాజెక్టు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.ప్రస్తుతం అతను పరిస్థితి విషమంగా ఉంది.స్వామి శ్రీశైలంలో శివమాల దీక్ష విరమణ చేసి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.దోర్నాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# బోదేపాడులో కర్ణాటక టెట్రాప్యాకెట్లు పట్టివేత

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** గోనెగండ్ల మండల పరిధిలోని బోదేపాడు గ్రామంలో బోయ మహేష్ ఇంటిపై దాడిచేసి 2014 కర్ణాటక టెట్రాప్యాకెట్లు పట్టుకున్నట్లు ఎక్స్ జ్ శాఖ సూపరెండెంట్ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు పత్తికొండ ఎక్స్ జ్ శాఖ వారికి బోదేపాడు గ్రామంలో కర్ణాటక టెట్రాప్యాకెట్లు అక్రమంగా అమ్మకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో పథకం ప్రకారం ఎక్స్జ్‌ఇన్స్పెక్టర్ సువర్ణలత, రాజేష్, ఇంద్రకిరణ్ తేజ లు బోదేపాడు చేరుకొని బోయ మహేష్ ఇంటి పై దాడి చేయగా 2014 కర్ణాటక టెట్రాప్యాకెట్లు ఇంట్లో ఉన్నాయి వాటిని స్వాధీనం చేసుకొన్నారు. అలాగే అక్రమ మద్యంతో సంబంధం ఉన్న మరో ఇద్దరిపై కూడా కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ దాడి కార్య క్రమంలో సిబ్బంది రామకృష్ణ రామచంద్రుడు, బషీర్, శాంతారాజు, అఫ్రోజ్, అయ్యన్న పాల్గొన్నారు.

# డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో ఇద్దరు వ్యక్తులు అరెస్టు

**-10వేలు జరిమాన.. ఏడు రోజులు జైలు**



జరిమాన, శిక్ష పడ్డ గోనెగండ్ల యువకులు

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** డ్రంక్ అండ్ డ్రైవ్‌కేసులో కోర్టు కొరడా ఝుళిపిస్తుంది. సోమవారం మండల కేంద్రమైన గోనెగండ్లలో గోర్లమురళి, షేక్ అన్వర్లు డ్రంక్ అండ్ డ్రైవ్లో దొరకడంతోవారిని పోలీసులు అరెస్టు చేశారు. వారిని మంగళవారం పత్తి కొండ కోర్టులో హాజరు పరచగా వారికి న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.10వేల జరిమాన, ఏడు రోజులు జైలు శిక్ష విధించినట్లు గోనెగండ్ల పోలీసులు తెలిపారు.

# విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** కోవెలకుంట్లలో ని 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా మంగళవారం విద్యార్థులకు వ్యాసర చన పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి తెలిపారు. కోవెల కుంట్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ ఎం మల్లికార్జున పర్యవేక్షణలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు స్వాతంత్ర్య ఉద్యమం గురించి పోటీలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. గ్రంథాలయ అధికారి బాల తిమ్మారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ రకాల పోటీతత్వ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, ఈ పోటీ పరీక్షల్లో విద్యార్థులు పాల్గొనాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు మద్దిలేటి, పాల్గొన్నారు.

## మండల సమితి మాజీ ఉపాధ్యక్షుడు మృతి..

**పరామర్శించిన కెఇ,బొజ్జమ్మ,వైకుంఠం**


నివాళులర్పిస్తున్న కెఇ ప్రభాకర్,ఇన్‌సెట్లో కుమారస్వామి గౌడ్

**దేవనకొండ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నేలతలమర్రి గ్రామానికి చెందిన సీనియర్ టిడిపి మండల నాయకులు,మండల సమితి మాజీ ఉపాధ్యక్షులు కుమారస్వామి గౌడ్ మంగళవారం తెల్లవారుజామున కన్ను మూశారు.కెఇ కుటుంబాలకు విధేయులుగా స్వర్గీయ వెంకటప్ప నాయుడుతో కలిసి మండలంలో దశాబ్దాల కాలంగా రాజకీయాలు చేశారు.అంతే కాకుండా అయన కుటుంబ సభ్యులు కూడ టిడిపి రాజకీయంలో క్రియాశీలంగా ఉన్నారు.ఇందులో భాగంగానే ప్రస్తుతం ఆయన కుమారుడు విజయభాస్కర్ గౌడ్ యంపిటిసి,టిడిపి మండల కన్వీనర్‌గా మరియు ఆయన అన్న కుమారుడు గ్రామ సర్పంచ్‌గా ఉన్నారు.గత కొంత కాలంగా అనారోగ్యంతో ఉండటంతో మంగళవారం మృతి చెందారు.విషయం తెలుసుకున్న మాజీ మంత్రి కెఇ ప్రభాకర్,పత్తికొండ ఎమ్మెల్యే శ్యాంబాబు,రాష్ట్ర వాల్మీకీ ఛైర్మన్ బొజ్జమ్మ దంపతులు ఆలూరు టిడిపి ఇచ్చార్జీ జ్యోతి భర్త వైకుంతం ప్రసాద్ ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ బిల్లేకల్ వెంకటేష్‌తో పాటు మండల టిడిపి నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో కుమారస్వామి గౌడ్‌కు నివాళులు అర్పించారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్‌న్యూస్ :** క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని హెచ్‌ఎం వెంకటరాముడు, సీనియర్ టీచర్ వివి పద్మావతిలు అన్నారు. గార్గేయపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జిఎఫ్ 69వ రాష్ట్ర స్థాయి అండర్-14, అండర్-17 ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులను మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా ఎజిఎఫ్ వారు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి సెలక్షన్స్‌లో తమ పాఠశాల క్రీడాకారులు అండర్-14, అండర్-17 ఫుట్‌బాల్, హాకీ క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నారన్నారు. అండర్-14 ఫుట్‌బాల్ బాలికల విభాగంలో దివ్య, బాలుర విభాగంలో నందీత్, అండర్-17ఫుట్‌బాల్ మధుమతి, రమ్యశ్రీ, ఉపేంద్రలు ఎన్నికయ్యారని తెలిపారు. అలాగే హాకీ క్రీడలో అండర్-14 హిమవంతురావ్, మంజుల అండర్-17విభాగంలో మమత యామిని, లక్ష్మణులు ఎన్నికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## శిక్షణ తరగతులకు అధికారులు, సర్పంచ్‌లు హాజరు కావాలి

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** సుస్థిర అభివృద్ధి లక్ష్యసాధనలో భాగంగా 5వ థీమ్‌కు సంబంధించి పర్యావరణాన్ని పరిరక్షించడం పచ్చధనాన్ని పెంపొందించడంపై మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, గ్రీన్ అంబాసిడర్లు, స్వయం సహాయక సంఘ సభ్యులకు గ్రామైక్య సంఘం లీడర్లకు ఈ నెల 19, 21, 26వ తేదీల్లో శిక్షణ తరగతులు ఉంటాయని ఈ శిక్షణ తరగతులకు ప్రతిఒక్కరు హాజరు కావాలని ఎంపిడిఓ నాగ అనసూయ మంగలవారం ఓ ప్రకటనలో తెలిపారు. 19న పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, 21న మండల రీసోర్స్, కోఆర్డినేటర్ గ్రీన్ అంబాసిడర్లు గ్రీన్ కార్డులు, 26న గ్రామైక్య సంఘం సభ్యులు, స్వయం సహాయక సంఘ సభ్యులు పాల్గొనాలని తెలిపారు.

## గ్రంథాలయం ఉపయోగాల పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన చాగలమరిలోని గ్రంథాలయంలో 58వ గ్రంధాలయ వారోత్సవంలో భాగంగా మంగళవారం గ్రంథాలయాలు, వాటిపై ఉపయోగా లు పోటీ పరీక్షలను విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ విద్యా మందిరంలొ లైబ్రరీన్ బండారు రామ చంద్ర యాదవ్ 58 వారోత్సవంలో భాగంగా విద్యార్థుల్లో అవగాహన విజ్ఞానం పెంపొందించేందుకు వివిధ రకాలైన గ్రంథాలయాల భాండాగారాల గురించి వివరించారు. విద్యార్థులకు జ్ఞానం పెంపొందించేందుకు, వివిధ పుస్తకాలను,అందుబాటులోఉంచారు.ఈ కార్యక్రమంలో లాలయ్య, భారతి విద్యా మందిరం ఉపాధ్యాయులు ప్రసాదు ఉపాధ్యాయులు, విద్యార్థులు విద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారులకు ప్రభుత్వ మెనూ ప్రకారం పోషకాహారం అందించాలి


అంగన్‌వాడి కార్యకర్తకు సూచనలిస్తున్న ఎంపిడిఓ శ్రీనివాసరావు

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** అంగన్‌వాడి కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ప్రభుత్వం మెనూ ప్రకారం పోషకాహారం అందించాలని ఎంపిడిఓ శ్రీనివాసరావు అంగన్‌వాడి టీచర్‌కు సూచించారు. మంగళశారం మండల పరిధిలోని అలేబాద్ గ్రామంలోని అంగన్‌వాడి కేంద్రాన్ని ఎంపిడిఓ శ్రీనివాసరావు, డిప్యూటి ఎంపిడిఓ వై.ప్రభాకర్‌లు సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కేంద్రంకు సంబందించిన భవనం కూలిపోవడానికి సిద్దంగా ఉన్నందున మరో కేంద్రానికి వెళ్ళాలని అంగన్‌వాడి వర్కర్‌కు అధికారులు సూచించారు. ఈ సందర్భనలో పిడిఓ జి.శ్రీకాంత్, సర్పంచ్ హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాజీమార్గమే రాజమార్గం- జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

**ః- డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్**


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ధి

**కల్లూరు, మేజర్‌న్యూస్ ః** రాజీ మార్గమే రాజమార్గమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి కబర్ధి, కార్యదర్శి లీలా వెంకట శేషాద్రిలు అన్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లాల పోలీస్ అధికారులతో జిల్లా కోర్టులోని న్యాయ సేవ సదన్‌లో డిసెంబరు 13న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కోర్టులలో పెండింగ్‌లో ఉన్న రాజీ కాదగిన కాంపౌండబుల్ క్రిమినల్ కేసులు, ఎక్సైజ్ కేసులు త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతీయ లోక్ అదాలత్‌ను డిసెంబరు 13న నిర్వహిస్తున్నామన్నారు. అందులో ఎక్కువగా క్రిమినల్ కేసులు పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించి జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకుని వారి కేసులను రాజీ చేసుకోవాలన్నారు. కోర్టు మానిటరింగ్ పోలీసులను కోర్టులలో ఉన్న కేసులను మానిటరింగ్ చేసుకుని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫోక్సోకోర్టు అదనపు జిల్లా జడ్జి రాజేంద్రబాబు, మేజిస్ట్రేట్లు అనిల్ కుమార్, అపర్ణ, అనూష, పత్తికొండ డిఎస్పీ వెంకటరామయ్య, డిఎస్పీ ప్రమోద్ కుమార్, కర్నూలు దిశ సిఐ రామానాయుడు, ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలంటూ కలెక్టర్‌కు రైతు సంఘం వినతి


రైతు సంఘం నాయకులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** ప్రభుత్వం సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరికి రైతు సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేశారు. అనంతరం ఆదోనిలోని విఘ్నేశ్వర ఎండిబిఎల్ ఫ్యాక్టరీలలో పత్తి సిసిఐ కొనుగోలు కేంద్రాలను పరిశీలించి అక్కడికి వచ్చిన కర్నూలు జిల్లా కలెక్టర్ దృష్టికి పత్తి రైతుల సమస్యలను గురించి, సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు సూచించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశులు, మల్లయ్యలు మాట్లాడుతూ, ప్రభుత్వం కొన్ని సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేయడం వలన రైతులకు స్లాట్ బుకింగ్ చేసుకోవడం ఇబ్బందిగా ఉందని, నాణ్యత పేరుతో సిసిఐ అధికారులు పత్తిని కొనుగోలు చేయడం లేదన్నారు. బయట మార్కెట్లో, ఫ్యాక్టరీలలో చాలా తక్కువ ధరకు పత్తిని వ్యాపారస్థులు కొనుగోలు చేస్తున్నారన్నారు. క్వింటాల్‌కు రూ.5వేలు నుండి రూ.6వేలు వరకు ధర ఉందన్నారు. సిసిఐ కేంద్రాల్లో తూకాల్లో మోసాలు జరుగుతున్నాయన్నారు. వీటిని తక్షణం అరికట్టాలని కోరారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. స్లాట్ బుక్ చేసుకోవడానికి ఉన్న ఇబ్బందులను త్వరలో తొలగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఈరన్న, అయ్యప్పతోపాటు మండల కమిటీ సభ్యులు శేఖర్, హనుమంతరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## యువత శక్తి దేశాభివృద్ధిలో కీలకపాత్ర..ఎస్సై మధుసూదన్


విద్యార్థినీ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై మధుసూదన్

**ప్యాపిలి, మేజర్‌న్యూస్ః** నేటితరం యువత శక్తి దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తుందని ప్యాపిలి ఎస్సై మధుసూదన్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్యాపిలి ఎస్సై మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై మధుసూదన్ మాట్లాడుతూ గరిష్ట సంఖ్యలో ఉన్న మన దేశ యువత మాదకద్రవ్య రహిత భారతదేశ ప్రచారంలో చేరడం ఎంతో ముఖ్యమన్నారు. దేశం యొక్క ఈ సవాళ్ళను స్వీకరిస్తూ, మాదకద్రవ్యాల నుండి దేశాన్ని కాపాడుకుందామన్నారు. సమాజం, స్నేహితులు, కుటుంబాలను మాత్రమే కాకుండా మనం కూడా మాదకద్రవ్యరహితంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కావున మనమందరం కలిసి మన జిల్లా, రాష్ట్రానిన మాదకద్రవ్యరహితంగా మార్చడానికి ధృడమైన నిర్ణయం తీసుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ అధికారి నవీన్‌పాఠీ, అధ్యాపకులు రామకృష్ణయ్య, ఓబులేసు, మురళీ మోహన్, వెంకటరమణ, మద్దిలేటి, శంకరయ్య, వన్నూర్, మంజునాథ్, సురేష్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటే బంగారు భవిష్యత్తు

**– ఆత్మకూరు టౌన్ సిఐ రాము**


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిఐ రాము

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ప్రతి విద్యార్థి మాదక ద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలని, పాశ్చాత సాంప్రదాయాలను అలవర్చుకొని మాదకద్రవ్యాల వాడకం ఫ్యాషన్‌గా చేసుకోకుండా వాటికి దూరంగా ఉంటేనే ప్రతి విద్యార్థిగా బంగారు భవిషత్ సొంతమవుతుందని ఆత్మకూరు టౌన్ సిఐ రాము అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు భారత ముక్తా అభియాన్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహ కల్పించడమైంది. ఈ సందర్భంగా ఆత్మకూరు టౌన్ సిఐ రాము మాట్లాడుతూ మాదక ద్రవ్యాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వినియోగం, వాటి దుష్పరిణామాల గురించి విద్యార్థులకు వివరించామన్నారు. నేటి ఆధునిక సమాజంలో విద్యార్థులు మాదక ద్రవ్యాల వాడకాన్ని ఫ్యాషన్‌గా మార్చుకొని బంగారులాంటి భవిషత్‌ను చేతురాల నాశనం చేసుకుంటున్నారని, ఇది మాదక ద్రవ్యాలపై అవగాహన లేకపోవడమేనని అన్నారు. పోలీసు శాఖ ద్వారా ప్రతి ఒక్కరికి మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించి విద్యార్థులకు ఉజ్వల భవిషత్‌ను అందించాలన్నదే ధ్యేయమన్నారు. మాదక ద్రవ్యాలకు సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసిన పోలీసులకు సమాచారం ఇచ్చి మాదక ద్రవ్యరహిత సమాజ స్థాపనలో విద్యార్థులు భాగస్వామ్యులు కావాలని కోరారు. గంజాయి, డ్రగ్స్, మద్యం, ధూమపానం లాంటి వాటికి దూరంగా ఉంటూ డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు బాధ్యతవహించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, పోలీసులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి



**హొళగుంద,మేజర్‌న్యూస్ః** క్రీడలు మానసికంగా ఉల్లాసం ఇస్తాయని గ్రంథాలయం అధికారి దేవేంద్ర అన్నారు.58వ జాతీయ గ్రథాలయ వారోత్సవాలో భాగంగా మంగళ వారం విద్యార్థులకు వ్యాస రచన,క్విజ్, మ్యూజిక్ ఛైర్స్ పోటీలను నిర్వహించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటపాటలలో రాణించాలని తెలిపారు.అనంతరం దేశ నాయకుల గురించి విద్యార్థులకు అవగా హన కల్పించారు. గ్రంథాలయ సిబ్బంది నాగరాజు,విద్యార్థులు,పాఠకులు పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com



# మాదకద్రవ్య రహిత సమాజంగా మారుద్దాం

**:- కమీషనర్ పి విశ్వనాథ్**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** మాదక ద్రవ్యాల రహిత సమాజ స్థాపనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ కమీషనర్ పి విశ్వనాథ్ తెలిపారు. నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం కొండారెడ్డి బురుజు వద్ద ఉద్యోగులు, సిబ్బందితో మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర సామాజిక న్యాయ సాధికారిత మంత్రిత్వ శాఖ ఆద్వర్యంలో చేపట్టిన నషా ముక్త్ భారత్ అభియాన్ గొప్ప ప్రాజెక్టు అని అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించడం, వ్యసనగ్రస్తులను గుర్తించి వారిని దాని నుండి విముక్తులను చేయడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని కమీషనర్ తెలిపారు. యువత, విద్యార్థులు, మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి దేశాన్ని ప్రగతి వైపు



మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతిజ్ఞ చేయిస్తున్న కమీషనర్

నడిపించాలని సూచించారు. మాదక ద్రవ్యాల దుష్పరిణామాలు, అక్రమ రవాణాను నిరోధించడం ప్రతి పౌరుడి బాధ్యతగా పేర్కొన్నారు. ఉద్యోగులు సైతం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్న రాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగ శివప్రసాద్, ఆర్ఓ జునైద్, కార్యదర్శి నాగరాజు, సూపరింటెండెంట్ సుబ్బన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డలో రోడ్డు ప్రమాదాల నివారణపై అఖిలప్రియ ప్రత్యేక దృష్టి

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణపై ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ప్రత్యేక దృష్టి సారించారు. మంగళవారం ఆమె జాతీయ రహదారి అధికారులు, డీఎస్పీ ప్రమోద్ కుమార్, సీఐ యుగంధర్ లతో కలిసి ఆళ్లగడ్డ పట్టణ శివార్లలోని అహోబిలం బైపాస్ రోడ్డు, దోస హౌస్ మరియు టిట్కో గృహ సముదాయాల దగ్గరగా వెళ్లే సర్వీస్ రహదారిని ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈసందర్భంగా స్థానిక పరిస్థితులు, రహదారి నిర్మాణలోపాలు, ట్రాఫిక్ సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయన్న అంశంపై ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్‌తో చర్చించిన ఆమె నేషనల్ హైవే అధికారులతో సమన్వయం చేసి తక్షణమే సర్వీస్ రోడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ అవసరమైన మరమ్మతులు, సూచిక బోర్డులు, సేఫ్టీ మెజర్లు తక్షణం అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అవసరమైన ప్రదేశంలో అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఆదేశించారు.



అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ

# ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని సేవలు అందుబాటులోకి

**– ఎమ్మెల్యే చేతులమీదుగా ఎక్సరే విభాగం ప్రారంభం**

**పత్తికొండ, మేజర్ న్యూస్:** పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో అన్ని రకాల సేవలు అందుబాటులోకి తెస్తున్నామని ఎమ్మెల్యే కె.ఈ శ్యాంబాబు పేర్కొన్నారు. మంగళవారం నూతంగా ఏర్పాటుచేసిన ఎక్సరే విభాగాన్ని ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపాటి సమస్య వచ్చిన కర్నూలుకు రెఫర్ చేసే పరిస్థితులు ఉండేవన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన ఏడాదిన్నరలో ఆసుపత్రిలో వాటర్‌ప్లాంట్ ఆపరేషన్ థియేటర్ ఈరోజు ఎక్సరే విభాగం ఏర్పాటు చేశామన్నారు. ఇకపై రోగులు ఎంతటి క్లిష్టమైన సమస్యతో వచ్చిన ఇక్కడే చికిత్సలు అందిస్తారన్నారు. ఆసుపత్రి ఆధునీకరణకు రూ. 3కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, త్వరలో పనులు కూడ చేపడతామన్నారు. అయితే ప్రస్తుతం వైద్యుల కొరత ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని త్వరలోనే సమస్య పరిష్కరిస్తామన్నారు. పేదలకు ప్రభుత్వం అందించే ఉచిత వైద్యసేవలు పూర్తిస్థాయిలో అందించాలన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు సాంబశివారెడ్డి, ప్రమోద్ కుమార్‌రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సురేష్ కుమార్, బత్తినలోకనాథ్, కడవల సుధాకర్, తిమ్మయ్య చౌదరి, ఆసుపత్రి ఇంచార్జీ డాక్టర్ కల్పన, డాక్టర్ హరిక, మణిదీప్,తదితరులు ఉన్నారు.



ఎక్సరే విభాగాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్యాంబాబు



ఎక్సరే తీస్తున్న ఎమ్మెల్యే

## పరిధి దాటి యాంటీ మైక్రోబియల్స్ వాడకం అనర్ధదాయకం

**:- కెఎంసి ప్రిన్సిపల్ డా.కె చిట్టి నరసమ్మ**


**కర్నూలు వైద్యం, మేజర్‌న్యూస్ :** యాంటీ మైక్రోబియల్స్‌ని ఒక పరిధి దాటి ఉపయోగిస్తే మానవ ఆరోగ్యంతో పాటు జంతువుల ఆరోగ్యం, పర్యావరణం కూడా దెబ్బతింటుందని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టర్ కె చిట్టి నరసమ్మ తెలిపారు. మంగళవారం నగరంలోని మెడికల్ కాలేజీలో మైక్రో బయాలజీ డిపార్ట్‌మెంట్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్న యాంటీ మైక్రోబెల్ రెసిస్టెన్స్ వారోత్సవాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాంటీ మైక్రోబెల్ రెసిస్టెన్స్ అంటే బ్యాక్టీరియా, వైరస్, శిలింద్రాలు, పరాన్న జీవులు మితిమీరిన మందులు వాడటం వల్ల మందులకు స్పందించడం మానేస్తే అంటువ్యాధులకు చికిత్స చేయడం కష్టతరమవుతుం దన్నారు. వ్యాధుల వ్యాప్తి, అనారోగ్యం, మరణ శాతాన్ని పెంచుతుందని కావున ప్రతిఒక్కరు యాంటీ మైక్రోబెల్స్ వాడకంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. అవసరం మేరకే వాటిని వాడాలని కోరారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, ఏడియం డాక్టర్ కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్థలు ఆరోగ్య నిపుణులు ఏయంఆర్ గురించి విస్తృత అవగాహన కలిగిస్తున్నారని, మందుల వాడకం అన్నది అవసరం మేరకు, నిర్దిష్ట స్థాయిలో ఉండాలన్నారు. కెఎంసి వైస్ ప్రిన్సిపల్ మైక్రో బయాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. రేణుకాదేవి మాట్లాడుతూ యాంటీ మైక్రోబెల్ అసిస్టెంట్ గురించి 18నుంచి 24వరకు విభిన్న కార్యక్రమాలు రూపొందించామని విస్తృత అవగాహన కలిగించేందుకు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా.సుధాకుమారి, గైనిక్ విభాగాధిపతి డా.సావిత్రి, ఫార్మా కాలేజీ హెచ్‌ఓడి డా.రాజేష్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివ బాల తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న కెఎంసి ప్రిన్సిపల్ డా.కె చిట్టినరసమ్మ

## లక్ష బిల్వార్చనతో శ్రీబ్రహ్మానందీశ్వర స్వామికి అభిషేకాలు

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** నంద్యాల పట్టణంలోని శ్రీబ్రహ్మానందీశ్వరస్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన, అమ్మవారి లక్ష కుంకుమార్చన కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు రాచకొండ మురళీకృష్ణశర్మ, సురేష్‌శర్మలు తెలిపారు. మంగళవారం ఉదయం స్వామివార్లకు మహాన్యాస పూర్వక ఏకాదశవార రుద్రాభిషేకం, నమక చమక అభిషేకాలతో స్వామివారికి పూజలు చేసినట్లు చెప్పారు. అనంతరం శ్రీరాజ రాజేశ్వరీ అమ్మవారికి లక్ష కుంకుమార్చనలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.



శ్రీబ్రహ్మానందీశ్వరస్వామి

# చిన్నారులతో సరదాగా..కలెక్టర్ సిరి

**భోజన నాణ్యత పాటించాలని హెచ్చరిక**

**దేవనకొండ మేజర్ న్యూస్ :** జిల్లా కలెక్టర్ సిరి మంగళవారం మండల కేంద్రమైన దేవనకొండ నందు అంగన్ వాడీ,ప్రభుత్వ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఓ అంగన్ వాడీ కేంద్రానికి వె ళ్లి అక్కడ పరిస్థితులను పరిశీలించారు. అక్కడ చిన్నారులతో కాసేపు సరదాగా ముచ్చటించారు. పిల్లలకు ఎప్పటికప్పుడు పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. విధ్యార్థుకు చదవు గురించి మెళుకవలు సూచించి పదవతరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని కోరారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి నాణ్యత సరిగ్గా లేదని ఇలా ఉంటే మీరు తింటారా అని యంఇఒ,ప్రధానోపాధ్యాయులపై అగ్రహం వ్యక్తం చేశారు. విధ్యార్థులకు భోజన నాణ్యతతో పాటు పాఠశాలలో శుభ్రత కూడ పాటించాలని సూచించారు.



చిన్నారులతో ముచ్చటిస్తున్న కలెక్టర్ సిరి

## అన్నాభిషేక అలంకారంలో భీమలింగేశ్వరుడు

**మేజర్ న్యూస్- చాగలమర్రి :** చాగలమర్రి పట్టణంలోని భీమలింగేశ్వరాలయంలో మంగళవారం అన్నాభిషేకాలంకారంలో స్వామివారిని తిర్చిదిద్దారు. ఆలయ అధ్యక్షులు వెంకటేశ్వరు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆలయంలో అన్నాభిషేక అలంకారం నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు శివనాగప్ప,(పసాద్,నాగరాజు,అమరేష్, రమేష్, మల్లి, విశ్వనాధ్,తదితరులు పాల్గొన్నారు.



# మద్యం సేవించి వాహనాలు నడపరాదు

**:- ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్**

**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** ప్రయాణికులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని ట్రాఫిక్ సిఐ మన్సూరుద్దీన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడి కేసులు నమోదు చేసిన వారిని మంగళవారం కర్నూలు జెఎఫ్‌సిఎం కోర్టులో హాజరు పరిచినట్లు తెలిపారు. జెఎఫ్‌సిఎం జడ్జి 23మందికి ఒక్కొక్కరికి రూ. 10వేలు జరిమాన విధించినట్లు తెలిపారు. ట్రాఫిక్ సిబ్బంది ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారన్నారు. డ్రంక్‌అండ్ డ్రైవ్‌లో పట్టుబడితే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని కావున ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు.

## చైల్డ్ ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి..ఎంపీడీవో

**పాములపాడు మేజర్ న్యూస్ :** పాములపాడు మండలం పాములపాడు మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలు ఆధార్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో చైల్డ్ ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని తనిఖీ చేశారు. ఈ శిబిరంలో మొత్తం 38 మంది పిల్లలకు బయోమెట్రిక్ ఆధార్ అప్‌డేట్ సేవలను అధికారులు అందించారు. ఆధార్ ప్రత్యేక శిబిరం నవంబర్ 17 నుంచి 26 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఇదిలాఉంటే రేపు జెడ్పీ హెచ్ఎస్ హైస్కూల్‌లో కూడా శిబిరం నిర్వహించనున్న ట్టు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమఆధార్ వివరాలనుసరిచేసుకోవాలనిఎంపీడీవో సూచించారు.



# దత్తత వల్ల మాతృత్వం పొందవచ్చు

**మహానంది, మేజర్‌న్యూస్ :** ప్రతి ఒక్కరూ అనాధ పిల్లలను దత్తత తీసుకోవడం వల్ల మాతృత్వం పొందవచ్చునని ఆత్మకూరు సీడీపీవో కోటేశ్వరమ్మ తెలిపారు. మంగళవారం తిమ్మాపురం ఆదర్శ పాఠశాలలో దత్తత ప్రక్రియపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన సీడీపీవోతో పాటు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంరక్షణ అధికారి దర్గయ్యలు మాట్లాడుతూ పిల్లలు లేనివారు అనాద పిల్లలను దత్తత తీసుకోవడం ద్వారా ఆ పిల్లలకు మంచి భవిష్యత్తు, ఒక కుటుంబాన్ని ఇచ్చిన వారు అవుతారని అన్నారు. విద్యార్థులు తమ ఇంటి చుట్టు పక్కల వారికి, బంధువులకు దత్తత గురించి తెలియజేయాలని అన్నారు. బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. పోక్సో చట్టంపై విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లక్ష్మణరావు, ప్రాజెక్టు సూపర్ వైజర్ కవిత, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



# వ్యాసరచన వక్తృత్వ పోటీలు



**పాములపాడు మేజర్ న్యూస్ :** మండల కేంద్రంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు గ్రంథాలయ అధికారి కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ వ్యాసరచన వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థినీ-విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో భాగంగా ఉర్దూ పాఠశాలలో హెచ్.ఎం. బదరున్నీసా పర్యవేక్షణలో స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యా యులు హైమావతి ఉపాధ్యాయులు నిజాముద్దీన్, శ్రీనివాసులు, రవీంద్ర నాయుడు, ద్రాక్షాయిని భాయి, భారతి తదితరులు హాజరయ్యారు.

## విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న కర్నూలు డీఈవో, సిబ్బందికి నోటీసులు

**నంద్యాల నూనెపల్లె, మేజర్‌న్యూస్ :** విధులపట్ల నిర్లక్ష్యంగా ఉన్న కర్నూలు డిప్యూటీ ఈవో మహమ్మద్ బేగ్, డీఈవో కార్యాలయ సిబ్బందికి నోటీసులు జారీ అయ్యాయని బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రేవనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేసే సమయంలో ఆరోపణలు వచ్చాయని, వాటిపై విచారణాధికారి హోదాలో విచారణ నియమావళి ఉల్లంఘించిన డీఈవోకు, ఆయనకు సహకరించిన టీచర్లు శివయ్య, శ్రీనివాసులు, మౌళాలి, కృష్ణారావు, సాంబశివుడు, చంద్రశేఖర్, భాస్కర్‌రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రామచంద్రారెడ్డిలపై నేడు నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. వీరందరూ రాబోయే 15 రోజుల్లో బహిరంగ విచారించి తగు చర్యలు తీసుకోని పక్షంలో చట్ట, న్యాయ పరిధిలో ఫిర్యాదు చేస్తానని తెలిపారు.

## ఘనంగా ముగిసిన కార్తీకమాస దీపోత్సవ వేడుకలు


మాట్లాడుతున్న వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు

**డోన్, మేజర్‌న్యూస్ః** పట్టణంలోని స్థానిక పోలీసుస్టేషన్ ఆవరణలో ఉన్నటువంటి సాంబశివాలయంలో మంగళవారం కార్తీకమాస దీపోత్సవ వేడుకలు ఘనంగా ముగిసినట్లు ఆలయ ప్రధాన అర్చకులు కల్లే శేషావలిశర్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి వేద గాయత్రి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నంద్యాల శంకరశర్మ, సంఘం కార్యదర్శి శ్రీధర్‌బట్టు, డోన్ సబ్ జైల్ సూపరిండెంట్, న్యాయవాది ఎం.నాగభూషణంరెడ్డి, ప్రధాన అర్చకులు కల్లే శేషావలిశర్మ, కల్లె గంగాధరశర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఐవిఆర్ఎస్ కాల్స్ అవగహన కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి




**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండలంలో ఐవిఆర్ఎస్ కాల్స్ పై మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రము నందు మండల అధికారులు, పంచాయతీ సెక్రటరీ,గ్రామ సర్పంచ్ తో కలిసి ఇంటిఇంటి కలెక్షన్, ఐవిఆర్ఎస్ కాల్స్ పై అవగాహన,పారిశుధ్యం,పరిశుభ్రత ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలలో భాగంగా వస్తున్న ఫోన్ కాల్స్ ను ప్రజలు రిసివింగ్ చేసుకొని వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు చెప్పి సహకరించాలని సూచించారు.అదేవిదంగా గ్రామంలో పారిశుధ్యం నిర్వహించే వారికి తడి పొడి చెత్తను ఇచ్చి పారిశుధ్యం,పరిశుభ్రతకు సేకరించాలని,అందుచేత సీజనల్ వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని అందుకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలకు పారిశుధ్యం, పరిశుభ్రత, పరిరక్షణ పై అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ పేర్కొన్నారు.

## దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

**-నిందితుడు అరెస్టు..రిమాండుకు తరలింపు**



**సి.బెలగల్ మేజర్ న్యూస్ :** సి.బెలగల్ మండలం తిమ్మందొడ్డి గ్రామంలో సెప్టెంబర్ 25న తెలుగు చిన్న రెడ్డి ఇంట్లో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఎట్టకేలకు ఛేదించారు. అందులో భాగంగా మంగళవారం బెలగల్ ఎస్సై తెలిపిన వివరాల మేరకు సెప్టెంబర్ 25 తిమ్మందొడ్డి గ్రామంలో తెలుగు చిన్నరెడ్డి ఇంట్లో ఎవరులేని సమయంలో దొంగతనం జరిగిందని స్థానిక పోలీసు స్టేషన్ నందు కేసు నమోదైందని,సదరు కేసుపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కర్నూల్ డిఎస్పీ బాబు ప్రసాద్ నేతృత్వంలో కోడుమూరు సిఐ తబ్రేజ్ మరియు మండల ఎస్సై వేణుగోపాల్ రాజు తన బృందంతో బంధాలుగా ఏర్పడి విచారణ ప్రారంభించగా విచారణలో భాగంగా ఘటన ప్రాంతంలోసీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడు సదురు గ్రామానికి చెందిన గీర్ని వెంకటేష్ (45)ను మంగళవారం తిమ్మందొడ్డి చింతామనుపల్లె మధ్య అదుపులోకి తీసుకుని కర్నూల్ డిఎస్పీ ఆఫీసు నందు నిదుతున్ని హాజరుపరచి నిందుతునుండి 9తులాల బంగారం,55తులాల వెండి, లక్ష రూపాయల నగదు స్వాధీనం చేసుకుని యజమాని తెలుగు చిన్నరెడ్డికి అప్పగించారు.అనంతరం మీడియాతో ముందు నిందితున్ని హాజరుపరచి కేసు పూర్వాపరాలు కర్నూల్ డిఎస్పీ బాబు ప్రసాద్ వెల్లడించారు.తదుపరి నిందితున్ని కోర్టులో హాజరు రీమాండుకు తరచించామని ఎస్సై వేణుగోపాలరాజు వెల్లడించారు.

# త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండండి

**– ఎమ్మెల్యే గిత్త జయసూర్య**

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** కార్యకర్తలు త్వరలో జరిగే స్థానిక సంస్తల ఎన్నికల్లో ప్రతి గ్రామంలో పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన కొత్తపల్లిలో ముఖ్య కార్యకర్తల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి వారి సమస్యలను తెలుసుకుని ఆ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పార్టీ కార్యకర్తలు కలిసికట్టుగా పని చేసి పార్టీని బలోపేతం చేయాలని అన్నారు. రాష్ట్రంలోని ఏకైక క్షేత్రమైన కొలనుభారతి క్షేత్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ కొలనుభారతి ఆలయాన్ని శ్రీశైలం దేవస్థానంలో అనుసంధానం చేయడం జరిగిందని త్వరలోనే శ్రీశైలం అధికారులతో చర్చించి ఆలయ అభివృద్ధిపై చర్చ చేపట్టనున్నట్లు తెలిపారు. మండలంలోని శివపురం వద్దగల పెద్దవాగు వద్ద హైలెవెల్ వంతెన ఏర్పాటుకు ప్రతిపాదనలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో సిసి రహదారులు వేశామని తెలిపారు. త్వరలోనే ఇంకా వేయని గ్రామాలకు సిసి రోడ్లు, త్రాగునీటికై ప్రణాళికలు సిద్ధం చేసి అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న రాష్ట్ర ప్రభుత్వం అన్నదాత సుఖీభవ కింద రెండవ విడత నిధులను విడుదల చేయనున్నట్లు తెలిపారు. మొక్కజొన్న గింజలను ప్రభుత్వం కొనుగోలు చేయాలని


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

రాష్ట్ర ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకై ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మండల కన్వీనర్ లింగస్వామి గౌడు, మాజీ కన్వీనర్ చంద్రశేఖర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, సొసైటి చైర్మెన్ నాగేశ్వర యాదవ్, కో క్లస్టర్ అమర్నాధ్ యాదవ్, సర్పంచు శేఖర్, విజయకుమార్, రామిరెడ్డి, శివారెడ్డి, బుచ్చిరెడ్డి, రఫీ, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## 2025-2026 డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోండి

**జీవిఆర్ఎస్ డిగ్రీ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.భారతి**

**డోన్, మేజర్‌న్యూస్ః** 2025-2026 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థినీ, విద్యార్థులు డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ కొరకు దరఖాస్తులు చేసుకోవాలని జీవిఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యం.భారతి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిఏ(పొలిటికల్ సైన్స్), బీకాం(జనరల్ మరియు కంప్యూటర్ అప్లికేషన్స్), బిఎస్సి(బోటనీ, మ్యాథమ్యాటిక్స్), బిఎస్సి(కంప్యూటర్ సైన్స్) కోర్సులలో స్పాట్ అడ్మిషన్‌కు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కావున ఈనెల 17వ తేది నుండి 24వ తేది వరకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు తమ సర్టిఫికేట్లు అన్నింటిని డిగ్రీ కళాశాలలో అప్పగించి అడ్మిషన్ కొరకు రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారు. విద్యార్థులు ఈ సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్స్‌కు చివరిదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై కనిపించని ప్రధానమంత్రి మోడీ ఫోటో ..?

**– అధికారుల నిర్లక్ష్యమా, అలసత్వమా, లెక్కలేని తనమా..!**

**– చేప పిల్లల కార్యక్రమాన్ని బీజేపీ నాయకులు బాయికాట్**



బ్యానర్ కట్టిన వాహనం

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని బీజేవైఎం ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన (పీఎంఎంఎస్‌వై) 2020 సెప్టెంబర్ 10న ప్రారంభించబడిందని, 5 సంవత్సరాల కాలంలో మత్స్యరంగ యొక్క స్థిరమైన అభివృద్ధి ద్వారా నీలి విప్లవాన్ని తీసుకురావడం ఈ పథకం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని, చేప పిల్లల విడుదల, ఉత్పత్తి పెంచడం, మౌళిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, మార్కెట్ వ్యవస్థను ఆధునీకరించడం, మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి తోడ్పటం, పర్యావరణం సురక్షితంగా, సామాజికంగా అందరికీ అదుబాటులో ఉండేలా చేయాలని లక్ష్యం పెట్టుకున్నారని అన్నారు. చేపల పెంపకంలో పెట్టుబడులు పెట్టి ఉపాధి అవకాశాలు సృష్టించడం జరుగుతుందని అన్నారు. కానీ వెలుగోడు మండలంలో అధికారులు నిర్లక్ష్యంపై జిల్లా కలెక్టర్‌కు, పార్టీ పెద్దలకు ఫిర్యాదు చేస్తామని ఆయన పత్రికా ముఖంగా తెలిపారు.

# సమస్యల పరిష్కారమే లక్ష్యం..ఎమ్మెల్యే బీవీ

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు పోతుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కుర్ని కల్యాణ మండపంలో ఎమ్మిగనూరు మండలం కు సంబంధించిన వారికి ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు తీసుకొచ్చిన ఆర్జీలను ఎమ్మెల్యే బీవీ స్వీకరించారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ మండల పరిధిలోని వివిధ సమస్యల గురించి అర్జీలు వచ్చాయని వాటిని త్వరగా సంబంధిత శాఖకు పంపించి సమస్యకు పరిష్కారం చూపుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కేటీ వెంకటేష్, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.


ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బీవీ

# సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామానికి చెందిన దుర్వేశి నాగేంద్ర గత కొద్దిరోజుల క్రితం చింతకుంట గ్రామం వద్ద బైక్ ప్రమాదంలో మృతి చెందడం జరిగింది. దుర్వేశి నాగేంద్రకు టీడీపీ సభ్యత్వం నమోదు ఉండటం వలన టీడీపీ పార్టీ నుంచి ప్రమాద భీమా తరపున ఇన్సురెన్స్ రూ. 5లక్షల రూపాయల చెక్కును మంజూరు కావడం జరిగింది. చెక్కును ఆళ్లగడ్డ టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి చేతులమీదుగా నాగేంద్ర భార్య దుర్వేశి లక్ష్మికి రూ. 5లక్షల రూపాయల ఇన్సురెన్స్ చెక్కును అందించడం జరిగింది. ఈ సందర్భంగా టీడీపీ యువనాయకుడు భూమా జగత్ విఖ్యాత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి వారికి అవసరమైన సాయం అందించడం ప్రభుత్వ బాధ్యత అని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వార ఆర్థిక ఇబ్బంది ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఊరట కలిగించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన అన్నారు.



AP/TG TET, DSC స్పెషల్

# బయాలజీ




### శ్వాసక్రియ

**1. రెస్పయిర్ అంటే అర్థం ఏమిటి?**

ఎ. పీల్చడం   బి. వదలడం

సి. పీల్చడం మరియు వదలడం

డి. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలు

**2. ఊపిరితిత్తుల గురించి సరైన వాక్యాలను గుర్తించండి.**

1. ఇవి స్పాంజి లాగా ఉంటాయి
2. రెండు ఒకే పరిమాణంలో ఉంటాయి
3. ఎడమ ఊపిరితిత్తి కొంచెం చిన్నదిగా ఉంటుంది.
4. ఊపిరితిత్తులను కప్పుతూ ప్లూరా అనే రెండు పొరలుంటాయి.

ఎ. 1,2,3 మాత్రమే   బి. 2,3,4 మాత్రమే

సి. 1,3,4 మాత్రమే

డి. పైవి అన్ని సరైనవే

**3. మానవుని ఊపిరితిత్తుల సామర్థ్యం ఎంత?**

ఎ. 5800 లీటర్లు   బి. 5800 మి.లీ.

సి. 1200 మి.లీ.   డి. 500 మి.లీ.

**4. వాయుగోళాల నుండి రక్త కేశ నాళికలోకి వాయువు మార్పిడి ఏ పద్ధతిలో జరుగుతుంది?**

ఎ. కిణ్వనం   బి. విచ్ఛిన్నక్రియ

సి. ద్రవాభిసరణ   డి. వ్యాపనం

**5. Respiration అనే పదం Respire అనే ఏ భాష పదం నుండి ఏర్పడింది?**

ఎ. గ్రీకు   బి. లాటిన్

సి. ఫ్రెంచ్   డి. జర్మనీ

**6. జాన్ డాపర్ అనే రసాయన శాస్త్రవేత్త రాసిన గ్రంథం?**

ఎ. శరీర ధర్మ శాస్త్రం

బి. మానవ శరీర ధర్మశాస్త్రం

సి. వృక్ష శరీర ధర్మశాస్త్రం

డి. జంతు శరీర ధర్మశాస్త్రం.

**7. ఖర్చయ్యే గాలిని గుర్తించండి?**

ఎ. కార్బన్ డై ఆక్సైడ్($CO_2$)   బి. నైట్రోజన్

సి. ఆక్సిజన్   డి. కార్బన్ మోనాక్సైడ్

**8. వాయు గోళాల గురించి సరైన వాక్యాలను గుర్తించండి?**

1. ఇవి ఒకే కణం మందంతో ఉంటాయి
2. ఇవి అనేక కణాలతో మందంగా ఉంటాయి
3. వీటి సంఖ్య చాలా తక్కువ
4. ఇవి అసంఖ్యాకంగా ఉంటాయి.

ఎ. 1 & 2 మాత్రమే   బి. 3 & 4 మాత్రమే

సి. 1 & 3 మాత్రమే   డి. 1&4 మాత్రమే

**9. సరైన దానిని గుర్తించండి.**

1. $Hb+4O_2 \rightarrow Hb(O_2)_4$   ఊపిరితిత్తులలో
2. $Hb(O_2)_4 \rightarrow Hb+4O_2$   కణజాలాలలో

ఎ. 1 మాత్రమే   బి. 2 మాత్రమే

3. 1&2 మాత్రమే   4. 1&2 సరికావు

**10. శ్వాసక్రియ అనేది**

ఎ. జీవ, భౌతిక చర్యల సరళ ప్రక్రియ

బి. జీవ, భౌతిక చర్యల సంక్లిష్ట ప్రక్రియ

సి. జీవ, భౌతిక, రసాయనిక చర్యల సరళ ప్రక్రియ

డి. జీవ, భౌతిక, రసాయనిక చర్యల సంక్లిష్ట ప్రక్రియ

**11. ఉదర వితానం చదునుగా మారినపుడు**

1. ఉరః కుహర ఘన పరిమాణం పెరుగుతుంది.
2. ఉరః కుహర ఘన పరిమాణం తగ్గుతుంది.
3. ఊపిరితిత్తుల లోపలి పీడనం పెరుగుతుంది.
4. ఊపిరితిత్తుల లోపలి పీడనం తగ్గుతుంది.

ఎ. 1&2 సరైనవి   బి. 2&3 సరైనవి

సి. 1&4 సరైనవి   డి. 2&4 సరైనవి

**12. శ్వాసక్రియ గురించి తెలియని కాలంలో శ్వాసక్రియ అనే పదాన్ని ఏ విధంగా ఉపయోగించేవారు?**

ఎ. వాయు ప్రసార మార్గంగా

బి. ఉష్ణాన్ని ఉత్పత్తి చేసే ప్రక్రియగా

సి. వైద పరిభాష పదంగా   డి. పైవన్నీ

**13. సరైన క్రమంలో అమర్చండి**

1. ఊపిరితిత్తులలో వాయుమార్పిడి
2. ఉచ్ఛ్వాస నిచ్ఛ్వాసాలు
3. కణజాలాల్లో వాయుమార్పిడి
4. రక్తం ద్వారా వాయు రవాణా
5. కణ శ్వాసక్రియ

ఎ. 1,2,3,4,5   బి. 5,4,3,2,1


సి. 2,1,3,4,5   డి. 2,1,4,3,5

**14. సరైన వాక్యాన్ని గుర్తించండి.**

1. క్లోరోఫిల్‌లో మెగ్నీషియం అణువు ఉంటుంది.
2. హిమోగ్లోబిన్‌లో ఇనుము ఉంటుంది.

ఎ. 1 మాత్రమే   బి. 2 మాత్రమే

సి. 1&2 సరైనవి   డి. 1&2 సరికావు




**15. ఊపిరితిత్తులలోనికి గాలి రావడానికి, బయటకు పోవటానికి సహాయపడేదాన్ని గుర్తించండి.**

ఎ. ఛాతీ కండరాలు మాత్రమే

బి. ఉదర వితానం మాత్రమే (డయాఫ్రమ్)

సి. ఎ మరియు బి

డి. ఊపిరితిత్తులు తమంతట తామే గాలిని తీసుకుంటాయి. బయటకు పంపుతాయి.

**16. ఆ కాలంలో పిలువబడ్డ స్థిరమైన వాయువును ఈ కాలంలో ఏమని పిలుస్తున్నాం?**

ఎ. ఆక్సిజన్   బి. ఆర్గాన్

సి. నైట్రోజన్   డి. కార్బన్ డై ఆక్సైడ్

**17. గ్లూకోజ్ ద్రావణంలో ఆక్సిజన్ లభ్యత తక్కువ అయినపుడు నీలిరంగు ద్రావణం ఏ రంగులోకి మారుతుంది?**

ఎ. ఎరుపు   బి. పసుపు

సి. నలుపు   డి. గులాబి

**18. జతపరచండి**

1. లాక్టోబాసిల్లస్( ) ఎ. $CO_2$+ నీరు+ శక్తి
2. ఈస్ట్ ( ) బి. $C_6H_{12}O_6$
3. జంతువులు () సి. లాక్టిక్ ఆమ్లం+ శక్తి
4. గ్లూకోజ్ ( ) డి. ఇథనాల్+ కార్బన్ డై ఆక్సైడ్ + శక్తి

ఎ. 1-డి, 2-సి, 3-ఎ, 4-బి

బి. 1-డి, 2-సి, 3-బి, 4-ఎ

సి. 1-సి, 2-డి, 3-ఎ, 4-బి

డి. 1-సి, 2-డి, 3-బి, 4-ఎ

**19. గాలిని వెచ్చచేయడం, గాలికి తేమను కలపడం వంటి ప్రక్రియలు ఇక్కడ జరుగుతాయి.**

ఎ. స్వరపేటిక   బి. గ్రసని

సి. వాయునాళం   డి. నాశికారంధ్రాలు

**20. కణశక్త్యాగారాలు (పవర్ హౌసెస్ ఆఫ్ ద సెల్) అని ఏ కణాంగాన్ని అంటాం?**

ఎ. హరితరేణువు   బి. రైబోసోమ్స్

సి. లైసోజోమ్స్   డి. మైటోకాండ్రియా

**21. జతపరచండి**

1. యమ ( ) ఎ. ధృడమైన శరీరాకృతి పొందడం
2. నియమ ( ) బి. సామాజిక క్రమశిక్షణ పాటించడం
3. ఆసన ( ) సి. శ్వాసక్రియ శక్తిని పెంపొందించుకోవడం
4. ప్రాణాయామ ( ) డి. వ్యక్తిగత క్రమశిక్షణ పాటించడం

ఎ. 1-ఎ,2-బి,3-సి,4-డి

బి. 1-ఎ,2-బి,3-డి,4-సి

సి. 1-బి,2-డి,3-సి,4-ఎ

డి. 1-బి,2-డి,3-ఎ,4-సి

**22. ఈ క్రింది వాటిలో గట్టి పెట్టె వంటి నిర్మాణాన్ని గుర్తించండి.**

ఎ. గ్రసని   బి. వాయునాళం

సి. స్వరపేటిక   డి. నాసికా కుహరం

**23. అవాయు శ్వాసక్రియ ఎప్పుడు జరుగుతుంది?**

ఎ. ఆక్సిజన్ లేనపుడు

బి. ఆక్సిజన్ తక్కువగా ఉన్నపుడు

సి. ఎ&బి

డి. ఎక్కువ మొత్తంలో ఆక్సిజన్ ఉన్నపుడు

**24. ప్రాణాయామంలో యామ అనగా**

ఎ. వాయువు   బి. గాలి

సి. శ్వాస   డి. ప్రయాణం

**25. గ్లూకోజ్ ద్రావణానికి ఆక్సిజన్ సరఫరా కాకుండా నిరోధించే ద్రావణాన్ని గుర్తించండి.**

ఎ. డయాజిన్ గ్రీన్   బి. జానన్ గ్రీన్ బి

సి. పారాఫిన్   డి. పొటాషియం హైడ్రాక్సైడ్

**26. ఇథనాల్ ఏ ఉష్ణోగ్రత వద్ద మరుగుతుంది?**

ఎ. 100 డిగ్రీల సెం.గ్రే.

బి. 90 డిగ్రీల సెం.గ్రే.   సి. 80 డిగ్రీల సెం.గ్రే.

డి. 70 డిగ్రీల సెం.గ్రే.

**27. ఈ క్రింది దానిని కణం యొక్క ఎనర్జీ కరెన్సీ అని అంటారు.**

ఎ. మైట్రోకాండ్రియా   బి. ADP

సి. ATP   డి. NADPH

**28. జతపర్చండి**

1. మాంగ్రూవ్ మొక్కలు ( ) ఎ. ప్రత్యేక కణజాలం
2. ఆర్కిడ్ జాతి మొక్కలు ( ) బి. శ్వాసవేర్లు
3. శ్వాసక్రియ ( ) సి. విచ్ఛిన్నక్రియ
4. కిరణజన్యసంయోగక్రియ ( ) డి. నిర్మాణాత్మక క్రియ

ఎ. 1-బి, 2-ఎ, 3-డి, 4-సి

బి. 1-బి, 2-ఎ, 3-సి, 4-డి

సి. 1-ఎ, 2-బి, 3-డి, 4-సి

డి. 1-ఎ, 2-బి, 3-సి, 4-డి

**29. గ్లూకోజ్ ద్రావణంలో ఇంకా ఆక్సిజన్ ఉన్నదో లేదో తెలుసుకోవాలంటే ఏ ద్రావణాన్ని ఉపయోగించాలి?**

ఎ. డయాజిన్ గ్రీన్   బి. జానస్ గ్రీన్ బి

సి. ఎ (లేదా) బి   డి. పారాఫిన్ ద్రావణం

**30. ఈస్టులో అవాయు శ్వాసక్రియ ద్వారా గ్లూకోజ్ నుండి ఏర్పడే అంత్య పదార్థాలు**

ఎ. లాక్టిక్ ఆమ్లం, శక్తి

బి. ఇథనాల్, కార్బన్ డై ఆక్సైడ్, శక్తి

సి. కార్బన్ డై ఆక్సైడ్, నీరు, శక్తి

డి. ఇథనాల్, శక్తి

**31. జతపరచండి**

1. వాయునాళాలు ( ) ఎ. చేపలు
2. మొప్పలు ( ) బి. కప్ప
3. ఊపిరితిత్తులు ( ) సి. కీటకాలు
4. చర్మం/ఆస్యగ్రసని/ ఊపిరితిత్తులు ( ) డి. సరీసృపాలు

ఎ. 1-సి, 2-ఎ, 3-డి, 4-బి

బి. 1-సి, 2-ఎ, 3-బి, 4-డి

సి. 1-డి, 2-ఎ, 3-సి, 4-బి

డి. 1-సి, 2-బి, 3-ఎ, 4-డి

**32. ప్రతి ATP లో ఎన్ని కేలరీల శక్తి నిల్వ ఉంటుంది?**

ఎ. 7000 కేలరీలు   బి. 7100 కేలరీలు

సి. 7200 కేలరీలు   డి. 7300 కేలరీలు

**33. వాయువు ఇక్కడ వడబోయబడుతుంది.**

ఎ. నాసికారంధ్రాలు   బి. నాసికా కుహరం

సి. గ్రసని   డి. స్వరపేటిక

**34. చక్కెర ఈస్ట్ ద్రావణం నుండి ఏ ప్రక్రియ ద్వారా ఇథనాల్‌ను వేరు చేయవచ్చు?**

ఎ. ద్రవాభిసరణ (ఓస్మాసిస్)   బి. విసరణ

సి. అంశికస్వేదనం   డి. విచ్ఛిన్నప్రక్రియ

**35. పతంజలి మహర్షి యోగాభ్యాస ప్రక్రియలో ఎన్ని విభాగాలలో ఎన్ని నియమాలను ప్రవేశపెట్టాడు?**

ఎ. 6 విభాగాలలో 197 నియమాలు

బి. 4 విభాగాలలో 195 నియమాలు

సి. 8 విభాగాలలో 196 నియమాలు

డి. 8 విభాగాలలో 195 నియమాలు

**36. తీవ్రమయిన వ్యాయామం చేసిన తర్వాత మన కండరాలు నొప్పికి దారి తీస్తాయి. ఈ నొప్పికి కారణం**

ఎ. సిట్రిక్ ఆమ్లం   బి. బోరిక్ ఆమ్లం

సి. లాక్టిక్ ఆమ్లం   డి. సల్ఫ్యూరిక్ ఆమ్లం.

**జవాబులు :**

1)ఎ, 2)సి, 3)బి, 4)డి, 5)బి, 6)బి, 7)సి, 8)డి, 9)సి, 10)డి, 11)సి, 12)డి, 13)డి, 14)సి, 15)సి, 16)డి, 17)డి, 18)సి, 19)బి, 20)డి, 21)డి, 22)సి, 23)సి, 24)డి, 25)సి, 26)డి, 27)సి, 28)బి, 29)సి, 30)బి, 31)ఎ, 32)సి, 33)బి, 34)సి, 35)డి, 36)సి



చకినారపు
సతీష్ కుమార్,
సీనియర్ ఫ్యాకల్టీ

# నాగటూరు లో స్వామిత్వ గ్రామసభ

**- ఆస్తుల హక్కుల వినియోగంపై ప్రజలకు అవగాహన - గ్రామ సభకు హాజరైన ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ**



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** మండల పరిధిలోని నాగటూరు గ్రామంలోని గ్రామపంచాయతీ నందు స్వామిత్వ పథకం పై గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో సుబ్రహ్మణ్య శర్మ, డిప్యూటీ ఎంపీడీవో రంగనాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తులకు చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు కల్పించడంలో స్వామిత్వ పథకం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. స్వామిత్వ పథకం ద్వారా ఆస్తుల సర్వే, డిజిటల్ మ్యాపింగ్ జరుగుతుందని ప్రాపర్టీ కార్డుల ద్వారా ఆస్తి హక్కుల పత్రాలను అందజేస్తారని వివరించారు. హక్కు పత్రాల ఉపయోగం మరియు వియోగం గురించి ప్రజలకు స్పష్టంగా వివరించారు భవిష్యత్తులో ఆస్తులపై రుణాలు పొందాలన్నా క్రయ విక్రయాలు జరపాలన్న ఈ పత్రాలు చట్టబద్ధమైన ఆధారంగా నిలుస్తాయని ఆస్తి వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు.

# అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్:**
ఎమ్మిగనూరు పట్టణంలోని శివ సర్కిల్ దగ్గర ఉన్న ఎస్బిఐ ఎటిఎం సెంటర్ ముందు అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన టికెలాల్ బరియా (36) గుర్తించారు. చెన్నాపురం దగ్గర ఇటుకల బట్టిలో పని చేస్తున్నట్టు గర్తింపు, రూరల్ పోలీసులు విచారణ చేపడుతున్నారు.

# అభివృద్ధి పనులకు పూజ కార్యక్రమం



అభివృద్ధి పనులలో భాగంగా యంత్రానికి పూజ చేస్తున్న టి.బలరాంగౌడ్

**వెల్దుర్తి, మేజర్‌న్యూస్‌:** 2024 సార్వత్రిక ఎన్నికలలో ఇచ్చిన హామిలో భాగంగా పట్టణంలోని 15వ వార్డు పలు అభివృద్ధి పనులకు మంగళశారం టిడిపి మండల అధ్యక్షులు టి.బలరాంగౌడ్ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టి.బలరాంగౌడ్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేఈ.శ్యాంకుమార్ పట్టణంలోని 15వ వార్డులో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఇచ్చిన హామీలో భాగంగా మంగళవారం 15వ వార్డులో దాదాపు 30 సంవత్సరాలుగా నెలకొన్న మంచినీటి సరఫరా చేసే పైప్‌లైన్, డ్రైనేజీ కాలువలు, సిసి రోడ్ల నిర్మాణాలకు నేడు ఎమ్మెల్యే పదవిలో కేఈ.శ్యాంకుమార్ ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పంచాయితీ సిబ్బంది, 15వ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గ్రంధాలయ వారోత్సవాలు నవంబర్14 నుండి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా గ్రంధాలయ అధ్యాపకులు డా. గంగన్న ఆధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు గ్రంథాలయాల విశిష్టత గురించి తెలియజేశారు. నేటి యువత అందరూ సెల్ఫోన్లకు అలవాటు పడి మంచి పుస్తకాలు చదవడం లేదన్నారు. ప్రతి ఒక్కరూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేయాలని, దినపత్రికలు ప్రతినిత్యం చదవాలని, జనరల్ నాలెడ్జి, కరెంట్ అఫైర్స్ పుస్తకాలు చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు గాయత్రి, విజయలక్ష్మి, నాగ మస్తాన్, డా.జయచంద్రుడు, డా.వెంకట సుబ్బయ్య, కాశీ విశ్వనాథ్, వెంకటేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాల జోలికి వెళ్ళవద్దు..



**కోసిగిమేజర్ న్యూస్:** యువతీ యువకులు, విద్యార్థులు మత్తుపదార్థాల జోలికి వెళ్ళవద్దని చదువుపైనే దృష్టి పెట్టాలని ఎక్సేంజ్ సిఐ భార్గవరెడ్డి తెలిపారు. మంగళవారం మత్తుపదార్థాల వల్ల కలిగే దుష్ప్రభావాల పై బాలుర హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దేశప్రధాని నరేంద్రమోడి నాసాముక్తాభారత్ అభియాన్ అనే కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారన్నారు. జిల్లా అధికారుల ఆదేశాల మేరకు బాలుర హైస్కూల్‌లో విద్యార్థులకు చిత్రలేఖనం, పాటలు పాడడం, కవితలు రాయడం వంటి పోటీలను నిర్వహించామన్నారు. మత్తుపదార్థాలపై విద్యార్థులుకు అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులచేత ప్రతిజ్ఞచేయించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఇన్‌చార్జి ప్రధానాపోధ్యాయులు నరసింహులు, ఎక్సేంజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# కల్లుకుంట గ్రామంలో పొలం పిలుస్తుంది

**-వరి, మొక్కజొన్న పంటలు పరిశీలించిన అధికారులు**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** పెద్దకడుబూరు మండల పరిధిలోని కల్లుకుంట గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి అనంతరం మండల వ్యవసాయాధికారి సుచరిత. సిబ్బంది మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలువురురైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మొక్కజొన్న పంటపై దాడిచేసి అపారమైన నష్టం కలిగిస్తున్న కత్తెరపురుగు లద్దెపురుగు జాతికి చెందింది. ముదురు పసుపురంగు ముత్యాల్లాంటి గుడ్లు సముదాయం ఆకు అడుగు భాగములోకాండంపై పెడుతుంది. లద్దె పురుగు 6 దశలు కలిగి ఉంటుంది. మూడవ దశకు చేరిన లద్దె పురుగు తల మీద తిరగబడిన 'వి' ఆకారంలో తెల్లని చారలు ఉంటాయి. ముదురు గోధుమ రంగు లార్వా దేహంపై నల్లని చుక్కల వరుసలు ఉండి తోకవైపు 8వ ఖండితంపై నల్లటి 4 చుక్కలు చతురస్రాకారంలో ఉండి మధ్యలో రోమం కలిగి ఉంటుందన్నారు. అలాగే తల్లి రెక్కల పురుగు లేత మొక్కలపై పెట్టిన గుడ్లు పగిలి లద్దె పురుగులుగా మారి, గుంపులుగా ఆకుల మీద పత్రహరితాన్ని గోకి తినుట వలన ఆకులపై తెల్లటి పొర ఏర్పడుతుంది. లద్దెపురుగు పగటిపూట ఆకుల అడుగు భాగాన చేరి, రాత్రి పంటపై దాడి చేస్తాయి రెండు మరియు మూడవ దశ లార్వాలు కాండం మొవ్వులో చేరి తినటం వలన విచ్చుకున్న ఆకుల్లో వరుస రంధ్రాలు ఏర్పడతాయి. క్రమంగా మొవ్వును తినివేయటం వలన మొవ్వు కత్తిరించినట్లుగా కనిపిస్తుంది. మొవ్వు లోపల ఉన్న పూత కూడా నష్టపోయి కంకి తయారవదు కంకి లేతగా ఉన్న దశలో పొరలను తొలచుకుంటూ రంధ్రాలు చేసి లోపలి గింజలను ఆశించి నష్టపరుస్తుందని అమెచెప్పారు. మొక్కజొన్నపంటను సకాలంలో విత్తుకోవాలి, విడతలుగా విత్తకూడదు. ఆలస్యంగా విత్తుటచే పంటలో పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటుంది. అంతర పంటలు సాగుచేస్తే పురుగు తక్కువగా ఆశిస్తుందని చెప్పారు. పురుగు గుడ్లు పెట్టుటకు ఆకర్షించే నేపియర్ గడ్డిని మొక్కజొన్న చుట్టూ 4 వరుసలలో వేసుకుని గుడ్ల సముదాయాన్ని నాశనం చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రైతు సేవ కేంద్రం సిబ్బంది పవన్, రవీంద్ర, నగ్రిన్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ప్రతి సమస్యను అధికారులు పరిష్కరించాలి – ఎమ్మెల్యే గిత్త

**కొత్తపల్లి, మేజర్‌న్యూస్ :** మండలంలో అధికారులకు ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను ఆయా శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఎమ్మెల్యే గిత్త జయసూర్య తెలిపారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయసూర్య మాట్లాడుతూ అధికారులు, సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటించాలని అన్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని ప్రభుత్వం అమలు చేసే పథకాలను ప్రజలకు అందించాలని అన్నారు. త్వరలోనే సచివాలయాలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. అధికారులు సమిష్టి కృషితో పని చేసి మండలాన్ని అభివృద్ధి దిశగా పని చేయాలని అన్నారు. ప్రజా పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి సమస్యను అధికారులు క్షుణ్ణంగా పరిష్కరించాలని అన్నారు. అనంతరం వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి



వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గిత్త జయసూర్య

తహశీల్దార్ అరుణ, ఈఓఆర్‌డి సుబ్బారావు, ఏపీఎం పుల్లయ్య, వ్యవసాయ అధికారిణి అమీరున్నిసా, పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఓలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వేంపెంట సహకార సొసైటీ 72వ వారోత్సవాలు

**పాములపాడు మేజర్ న్యూస్ :** వేంపెంటప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం 72వ వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలోభాగంగాసొసైటీ చైర్మన్ లక్ష్మీకాంత రెడ్డి సొసైటీ ఆవరణలో ఏర్పాటు చేసిన జెండాను ఆవిష్కరించారు సభలో సొసైటీ చైర్మన్ లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ సొసైటీ స్థాపన నుండి చేపట్టిన కార్యక్రమాలు, రైతులకు అందిస్తున్న రుణ సౌకర్యాలు, పంట రుణాలు, విత్తనాల పంపిణీ, ఎరువుల సరఫరా, వివిధ అభివృద్ధి పథకాల అమలు వంటి అంశాలను వివరించారు. గ్రామ రైతుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో సహకార సొసైటీ కీలకపాత్ర పోషిస్తోందని అన్నారు. సొసైటీ మరింత శక్తివంతం కావాలంటే సభ్యుల భాగస్వామ్యం, పారదర్శకత, సమిష్టి కృషి అవసరమని సూచించారు. నా బోర్డ్ కౌన్సిలర్ సురేంద్రబాబు మాట్లాడుతూ సైబర్ నేరాలపై రైతులు జాగ్రత్తగా ఉండాలని బ్యాంకు నుండి కాల్ చేస్తున్నామని ఓటీపీలు అడుగుతే చెప్పరాదని సూచించారు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని ఆర్థిక లావాదేవీలు గుర్తు తెలియని వ్యక్తులతో జరపరాదని సూచించారు పిల్లలలో అవగాహ



నకుపోటీలు సహకార వారోత్సవాల సందర్భంగా విద్యార్థుల కోసం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. గ్రామంలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. అందులో విజేతలైన డి. శివ నాయక్, ఎం.జగదీశ్వర్, బి. అంబేడ్ కాన్సిరాంలకు ప్రత్యేక బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాణిక్యమ్మ, సీఈఓ సాయికుమార్, శ్రీకాంత్, హెడ్‌మాస్టర్ రఫిక్ అహ్మద్, విశ్రాంత ఉపాధ్యాయుడు వై.దానమయ్య తదితరులు హాజరయ్యారు.

# ప్రజలపై విద్యుత్ భారాలు ఆపాలి

**కర్నూలు జడ్‌పి, మేజర్‌న్యూస్ :** ప్రజలపైన విద్యుత్ భారాలు వేయడానికి ప్రతిపాదించిన రూ.12717కోట్ల భారాలను ఆపాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం విద్యుత్ నియంత్రణ మండలి చేపట్టిన ప్రజాభిప్రాయ సేకరణలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు పాల్గొని మాట్లాడారు. సిఎం చంద్రబాబునాయుడు విడుదల చేసి శ్వేతపత్రంలోని అంశాలను పరిశీలించినప్పుడు గత ప్రభుత్వంలో విద్యుత్ తయారీ పంపిణీ సంస్థలు విద్యుత్ అధికారులు చేసిన నిర్లక్ష్యం, అవినీతి కారణంగా రూ.వేలకోట్లు ప్రజలపై భారాలు పడ్డాయని తెలిపారు. విద్యుత్ అధికారులు, సంస్థలు చేసిన అవినీతిపై ప్రభుత్వం విచారణ చేయాల్సింది పోయి విద్యుత్ నియంత్రణ మండలి ద్వారా చట్టబద్ధత చేసిందా అని ప్రశ్నించారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం రూ.15వేల కోట్లను 17నెలల కాలంలో ట్రూ అప్ సర్ఛ్ చార్జీలు, ఎలక్ట్రిక్ సిటీ డ్యూటీ పేరుతో ప్రజలకు సంబంధమే లేని భారాలను ప్రజలపై వేయడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మరి ప్రస్తుతం రూ.12,717కోట్లు 2025-26 కి ప్రతిపాదించడాన్ని విద్యుత్ నియంత్రణ మండలి అనుమతించకుండా నిరాకరించాలని ప్రజల తరుపున కోరుతున్నామని తెలిపారు. రూ.15వేల కోట్లు వసూలు చేసి రూ.900కోట్లు ట్రూడౌన్ చేసామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కావున ప్రజలపై వేసే ట్రూ అప్, సర్ చార్జీలు, ఇతర చార్జీలను వసూలు చేసే విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకు వెళితే మరో బషీర్బాగ్ ఉద్యమం చేయాల్సిన పరిస్థితి ప్రజలకు వస్తుందని విద్యుత్ నియంత్రణ మండలి ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.




ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న సిపిఎం నాయకులు

సూర్య www.suryaa.com

బుధవారం 19 నవంబరు 2025

# ఆరోగ్యకరమైన జీవనశైలి అవసరం

**:– రాష్ట్ర మంత్రి టీజీ భరత్**




మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

**కర్నూలు, మేజర్‌న్యూస్ :** ప్రతిఒక్కరు ఆరోగ్యకరమైన జీవనశైలి అలవరచుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని సంకల్‌బాగ్‌లోని విశ్వక్ గార్డెన్స్‌లో మంగళవారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుజరాత్ కమ్యూనిటీ వారు దంత సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి టీజీ భరత్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. ప్రతిరోజు ఉదయం, రాత్రి దంతాలను శుభ్రం చేసుకోవడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి అవగాహన



విద్యార్థులతో ముచ్చటిస్తున్న మంత్రి

కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమన్నారు. వీటి ద్వారా మంచి విషయాలు అందరికి తెలుస్తాయని ఆయన చెప్పారు. తనకు వీలు కుదిరినప్పుడల్లా ఇలాంటి అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటానని ఆయన తెలిపారు. ఆరోగ్యకరమైన జీవనశైలిలో వ్యాయామానికి కూడా చాలా ప్రాధాన్యత ఉందన్నారు. ప్రతి రోజు వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం చిన్నప్పటి నుంచే అలవాటు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం ఏర్పాటు చేసిన నిర్వాహకులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సోమిశెట్టి శ్రీకాంత్, నభూషా, డా.శ్వేత, డా.సునీత, డా.దివ్య, విభ, సేజన్, ఫర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నడపాలి

**:– ఆలూరు నియోజకవర్గంలో జోరుగా కోటి సంతకాల సేకరణ**
**:– వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి**



సంతకాల సేకరణలో పాల్గొన్న ఎమ్మెల్యే విరుపాక్షి, తెర్నేకల్ సురేందర్ రెడ్డి

**దేవనకొండ, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రభుత్వ రంగంలోనే నడపాలని వైకాపా రాష్ట్ర కార్యదర్శి తెర్నేకల్ సురేందర్ రెడ్డి అన్నారు. ఆలూరు నియోజకవర్గం దేవనకొండ మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో మాజీ సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి ఆధ్వర్యంలో కోటి సంతకాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛంధంగా పాల్గొని ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలను తప్పుబట్టారు. ఈ కార్యక్రమంలో తెర్నేకల్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ కూటమి ప్రభుత్వంలో పేద విద్యార్థులకు వైద్య విద్య అందనంత దూరం అవుతుందన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలు ప్రైవేటు పరం చేస్తే ఫీజులు భరించలేనంతగా పెరుగుతాయని, ప్రజలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందుబాటులో లేకుండా పోతుందని, పేద, మధ్య తరగతి ప్రజలకు ఉచిత సూపర్ స్పెషాలిటీ శాశ్వతంగా దూరమవుతాయన్నారు. ప్రజా నిధులతో నిర్మించిన సంస్థలను ప్రైవేటు సంస్థలకు అప్పగించడం దారుణమన్నారు. ఏది ఏమైనా ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం కానివ్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామకృష్ణ, సర్పంచ్ అరుణ్ కుమార్, మధుసూదన్ రెడ్డి, హంపిరెడ్డి, నామాల శీను, వీరన్న, మాదన్న, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గోనెగండ్ల మండలంలో పర్యటించిన కేంద్ర వ్యవసాయ శాఖ బృందం



తెగుళ్లు సోకిన ఉల్లిని పరిశీలిస్తున్న కేంద్రబృందం సభ్యులు

**గోనెగండ్ల,మేజర్ న్యూస్ :** కేంద్రవ్యవసాయశాఖ నుంచి వచ్చిన ఉన్నతాధికారుల బృందం, కర్నూలు జిల్లా పర్యటన లో బాగంగా మంగళవారం మండల కేంద్రమైన గోనెగండ్ల, గాజులదిన్నె గ్రామాలలో పర్యటించారు. ఈ గ్రామాలలో ఉల్లి సాగు చేసిన రైతులతో ముఖా ముఖి మాట్లాడారు. కేంద్రబృందం సభ్యులైన కేంద్ర వ్యవసాయశాఖ డిప్యూటీ కమిషనర్ బీజే బ్రహ్మ, అండర్ సెక్రటరి మనోజ్, డీప్యూటీ డైరెక్టర్ రాజీవ్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ హేమాంగబార్గవ్, సెంట్రల్ హెడ్ శరమనన్ లు గాజులదిన్నె, గోనెగండ్ల లో ఉల్లి సాగుచేసిన గౌరవ మునెప్ప, చాకలి రామచంద్ర తో మాట్లాడారు. ఉల్లి పంటను ఎప్పుడు సాగు చేశారు. ఎన్ని ఎకరాలలో సాగుచేశారు. ఏ రకం విత్తనాలను వాడారు. పంట దిగుబడి ఎలా వచ్చింది. ప్రస్తుతం పంట నష్టం రావడంకు కారణాలు ఏమి ఉల్లి గడ్డ రంగు ఎలా ఉంటుంది. ఇక్కడ పండిన పంటన స్టోరేజి చేసుకునెందుకు గోడౌన్లో లేవా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గోనెగండ్ల మండలంలో ఎన్ని వేల ఎకరాలలో ఉల్లి పంటను సాగు చేశారు. ఖరీఫ్ లోసాగు చేసిన ఉల్లి వల్ల రైతులకు ఎంత నష్టం వచ్చింది. ఎకరంకు ఎన్ని వేల పెట్టు బడి అవుతుందని అడిగి తెలుసుకున్నారు. తెగుళ్లు సోకిన ఉల్లి పంటను బృందం సభ్యులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హర్టికల్చర్ అధికారి రాజకృష్ణారెడ్డి, మైక్రోఇరిగేషన్ అధికారి ఫిరోజ్ ఉస్సేన్, డీడీహచ్ జమదగ్ని, వ్యవసాయశాఖ జేడీ వరలక్ష్మి, ఏడీఏ మహుమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత వీఏఏలు సుంకన్న, జగదీష్, షఫీ, శ్రీకాంత్ రామగోపాల్ పాల్గొన్నారు.

**తెగుళ్లు సోకడంతో దిగుబడి తగ్గిపోయింది పంట ఎండిపోయింది గౌరవ మునెప్ప, కౌలు రైతు, గాజులదిన్నె. గోనెగండ్ల మండలం :** కేంద్ర బృందం సభ్యులు గాజులదిన్నె గ్రామ పరిసరాలలో కౌలుకు తీసుకొని సాగు చేసిన గౌరవ మునెప్పతో మాట్లాడారు. ఎన్ని ఎకరాలు సాగు చేశావు. ఎంత పెట్టుబడి అయింది. ఎ రకం విత్తనాలు వాడావు. పంట ఎందుకు దిగుబడి రాలేదని ప్రభుత్వం సబ్సీడి విత్తనాలను అందిస్తుందా లేదా అని అడిగారు. ఎకరం కు ఎన్ని క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అడిగి తెలుసుకున్నారు. ఈ పంటన ఎన్ని నెలలు నిలువ ఉంటుందన్నారు. కోల్ట్ స్టోరేజి లో ఇక్కడ లేవా అని ప్రశ్నించారు. దీంతో రైతు మునెప్ప మాట్లాడుతూ ఈ ఏడాది మూడు. ఎకరాలను కౌలుకు తీసుకొని రూ. 4లక్షల పెట్టుబడి పెట్టి ఉల్లిపంటను సాగు చేశాను. అయితే అనుకోని విధంగా ఈ ఏడాది అధిక వర్షాలు కురిసాయి. దీంతో పంటకు తెగుళ్లు ఎక వగా సోకాయి. దీంతో దిగుబడి పూర్తి తగ్గిపోయింది. మార్కెట్ లో కూడా వంటకు గిట్టుదరలేదు. నేడో రేపో ఈ పంటను మూగజీవాలను గ్రాసంగా వదులుతాను అని తెలిపారు. ఖరీఫ్ సాగు చేసిన ఉల్లి ఎక్కువ రోజులు నిలువ ఉండదు. ఇక్కడ పండిన పంటకు సరిపోయే కోల్ట్ స్టోరేజిలు లేవన్నారు. ఉల్లి పంటనుసాగు చేసిన రైతులను ప్రభుత్వం ఆద కోవాలన్నారు.



గోనెగండ్ల మండలం గాజులదిన్నె లో ఉల్లి రైతు గౌరవ మునెప్పతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

## వేసవిలో త్రాగునీటి సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు తీసుకోండి

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి**



సమ్మర్‌స్టోరేజీ ట్యాంకును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

**ఆదోని, మేజర్ న్యూస్ :** వేసవి కాలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందుగానే సమగ్ర ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరి ఆదేశించారు. ఆదోని మండలం 104 బసాపురం గ్రామంలోని సమ్మర్ స్టోరేజీ (ఎస్ఎస్) ట్యాంకులో జరుగుతున్న మరమ్మత్తులు, నీటి నిల్వ సామర్థ్యాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఎస్ ట్యాంకుకు సంబంధించిన అన్ని మరమ్మత్తు పనులను నవంబర్ నెలాఖరుకల్లా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. డిసెంబర్ చివరి నాటికి ట్యాంకు పూర్తి సామర్థ్యంతో నీటిని నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం బసాపురం ఎస్ఎస్ ట్యాంకు 3,110 మిలియన్ లీటర్ల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ, ప్రస్తుతం కేవలం 20శాతం మాత్రమే నీరు ఉన్నట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రాబోయే వేసవిలో గ్రామ ప్రజలకు తాగునీటి కొరత రాకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సబ్ కలెక్టర్ అజయ్ కుమార్, తహశీల్దార్ రమేష్, మున్సిపల్ కమీషనర్ నాసిర్ ఉసేన్, మున్సిపల్ డిప్యూటీ ఇంజనీర్లు వెంకట చలపతి, రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# బనగానపల్లెలో మంత్రి బి.సి సుడిగాలి పర్యటన

**– వాకింగ్ ట్రాక్, అండర్ డ్రైనేజి పనులను పరిశీలించిన మంత్రి**



డ్రైనేజిని పరిశీలిస్తున్న మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** మంగళవారంనాడు బనగానపల్లె పట్టణంలో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. తెలుగు పేట, గంగమ్మగుడి కాలనీ, ఎల్.ఐ.సి ఆఫీసు నుండి మంత్రి పర్యటించారు. పట్టణంలో నిర్మాణంలో ఉన్న డ్రైనేజి రోడ్ల అభివృద్ధి పనులను వారు పర్యవేక్షించారు. కూటమి ప్రభుత్వంలో అందుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాల తీరును స్థానిక సంస్థలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయా అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని ఆయన తెలిపారు. బనగానపల్లె పట్టణంలోని కూరగాయల మార్కెట్‌ను పరిశీలించి పలు సలహాలను సూచనలను చేశారు.



వాకింగ్ ట్రాక్‌ను పరిశీలిస్తున్న మంత్రి బి.సి

బస్టాండు సమీపంలో అండర్ డ్రైనేజికి కొన్ని షాపులు అడ్డంగా ఉన్నాయి వారికి ఇప్పటికే పలుమార్లు నోటీసులు ఇచ్చామని వారు త్వరగా ఖాళీ చేస్తే నిర్మాణ పనులు మొదలవుతాయని లేకపోతే నిర్ణీత సమయం తరువాత సదరు షాపును తొలగించి పనులు చేపట్టాల్సి వస్తుందని తెలిపారు. బనగానపల్లె పట్టణంలో ప్రజలకు ప్రతిరోజు వాకింగ్ చేసుకోవడానికి సరైన ట్రాక్ లేక ఇబ్బంది పడుతున్నారని వారి కోసం గ్రౌండ్ నందు వాకింగ్ ట్రాక్ నిర్మించి ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణంలో వాకింగ్ చేసుకునేలా చేస్తామని తెలిపారు. బనగానపల్లె పట్టణాన్ని రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అత్యంత సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు.

# ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** సింగిల్ డెస్క్ విధానం ద్వారా జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించి వారి ద్వారా అందిన దరఖాస్తులకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని డ్వామా కార్యాలయంలో జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ రాజకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత త్రైమాస కాలంలో వివిధ పరిశ్రమల స్థాపనకు అనుమతులు కోరుతూ 686 దరఖాస్తులు అందగా సింగిల్ డెస్క్ విధానంలో ఆయా శాఖల ద్వారా 652 పరిశ్రమలకు అనుమతులు మంజూరు చేశారని 32 దరఖాస్తులఉ పరిశీలనలో ఉన్న దరఖాస్తులు అన్నింటిపైన నిర్దిష్ట గడువులోపున తగిన పరిష్కారం అందించాలని పర్యావరణ పరిరక్షణ ఫ్యాక్టరీస్ శాఖల అధికారులను ఆదేశించారు. చిన్న మధ్య తరహా పరిశ్రమల ప్రోత్సాహం కొరకు పెట్టుబడి రాయితీ పవలా వడ్డీ విద్యుత్తు సేల్‌టాక్స్ తదితర రాయితీల కింద జిల్లాలో ఉత్పాదన సేవా రంగాల్లోని 4, యూనిట్లకు మొత్తం 11.14లక్షల విలువైన రాయితీ ప్రయోజనాల జారీకి కమిటీ ఆమోదం తెలియజేసింది. పరిశ్రమల ఏర్పాటుతో జిల్లా మరింత అభివృద్ధి చెందుతుందని జిల్లాలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించాలన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మహబూబ్‌బాషా ఎల్‌డిఎం రవీందర్ కుమార్, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ నారాయణరెడ్డి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ కిషోర్‌రెడ్డి, డీపీఓ లలితభాయ్, జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి పాల్గొన్నారు.